ఉచిత వైద్య శిబిరం
విజయవంతం

పరీక్షలు చేస్తున్న వైద్యులు

మియాపూర్ , ఫిబ్రవరి 2 : వాణిజ్య దృక్పథంతో కాకుండా సామాజిక సేవా కోణంలో ఉచితంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుండటం అభినందనీయమని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అన్నారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డివిజన్ పరిధిలోని కమల ప్రసన్ననగర్‌లో హోలిస్టిక్ దవాఖాన ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రోజాదేవి మాట్లాడుతూ ప్రజల మధ్యకే వచ్చి ఉచిత వైద్య సేవలను అందిస్తూ ఆరోగ్య సలహాలను అందిస్తుండటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శేఖర్ , తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై
సీపీఐ నిరసన

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి2: కేంద్ర బడ్జెట్‌తో పేదలు, నిరుద్యోగులకు ఉపయోగంలేదని సీపీఐ నేతలు విమర్శించారు. జగద్గిరిగుట్టలో ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ధరలు, రూపాయిక్షీణత, ద్రవ్యోల్బణంపై చర్యలు తీసుకోకుండా ఓట్ల కోసం ఉద్యోగులు ఆదాయపన్ను రద్దు అంటున్నారని ఎద్దేవాచేశారు. తెలంగాణకు ఎనిమంది మంది బీజేపీ ఎంపీలున్నా ఏమీ ఒరగలేదన్నారు. మెట్రో కారిడార్, మూసీ, రీజనల్‌రింగురోడ్డు, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్సిటీ కి నిధులు ఏవని ప్రశ్నించారు. ఉమామహేశ్, హరినాథ్, దుర్గయ్య, సదానంద్, అరవింద్, సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సీపీఐ ప్రతినిధులు

లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

యాదాద్రి లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం లక్ష్మీనర్సింహాస్వామిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. యాదాద్రి లక్ష్మీనర్సింహాస్వామి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.
–కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 2 :

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్ , ఫిబ్రవరి 2 : 11 కేవీ శాతవాహన నగర్, 11 కేవీ హైదర్‌నగర్, 11 కేవీ గౌతమీ నగర్, 11 కేవీ హెచ్ ఎంటీ హిల్స్ , 11 కేవీ జలవాయు విహార్‌ల ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శాతవాహననగర్, హైదర్‌నగర్ విలేజ్, గౌతమీనగర్, శ్రీనివాస్ కాలనీ లేక్ వ్యూ కాలనీ, శుభోదయ కాలనీ, వర్టెక్స్, హెచ్ఎంటీ హిల్స్, జేఎన్‌టీయూ పోలీస్ స్టేషన్, జలవాయు విహార్‌ల ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు భాగ్యనగర్ ఏఈ షాబాజ్ తెలిపారు.

అంబీర్ చెరువు సుందరీకరణ

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు ఆదివారం కాలనీ వాసులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులోకి వ్యర్థపు నీరు చేరకుండా నిలువరించి దోమల నివారణ చర్యలు చేపట్టడంతో పాటు పరిసరాలను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తామన్నారు. సౌకర్యవంతమైన వాకింగ్ ట్రాక్, పచ్చదనం సహా ఇతర అంశాలన్నింటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు తెలిపారు.
–మియాపూర్, ఫిబ్రవరి 2 :

ప్రజావాణిని సద్వినియోగంచేసుకోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 2 : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జోనల్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మూసాపేటలోని జోన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. ప్రజావాణిలో జడ్సీతో పాటుగా జోనల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో ప్రజా సమస్యలపై ఫిర్యాదులను ప్రజావాణిలో అందిస్తే అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. అలాగే కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల కార్యాలయంలో ప్రజావాణి కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీలు వంశీకృష్ణ, గంగాధర్ తెలిపారు.

మాతృశ్రీ నగర్‌లో వాలీబాల్ ప్రీమియర్ లీగ్

మాదాపూర్, ఫిబ్రవరి 2: మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ నగర్ కాలనీలో వాలీబాల్ ప్రీమియర్ లీగ్‌ను ఆదివారం నిర్వహించారు. ఇందులో మొత్తం 10 టీంలు పాల్గొనగా ప్రథమ విజేతగా కిష్టిపాటి రవీంద్రరెడ్డి ఎంపీపీఎల్ –2025 విజేతగా నిలిచాడు. ప్రీమియర్ లీగ్‌లో గెలుపొందిన విజేతలకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ విచ్చేసి విజేతలకు బహుమతులను ప్రదానం చేసిన అనంతరం క్రీడాకారులను అభినందించారు. ఐదేండ్లుగా క్రీడా పోటీలను నిర్వహిస్తు న్నట్లు భూపాల్ రెడ్డి తెలిపారు. లక్ష్మణ్, రామకృష్ణ రాజు, గణపతి, ఉమా మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి

కార్మికుల పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్ వేంకటేశ్వర్ నాయక్

దుండిగల్,ఫిబ్రవరి 2 : దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆదివారం పరిశీలించారు. ముఖ్యంగా సిబ్బంది హాజరును బయోమెట్రిక్ ద్వారా తీసుకోవడం పరిశీలించారు. అన్ని వార్డుల నందు స్వచ్ఛ ఆటోలను పరిశీలించి, డోర్ టూ డోర్ ఇంటింటికీ వెళ్లి 100 శాతం చెత్త సేకరించాలని సూచించారు. రోడ్డుకిరువైపులా ఉన్న గార్బేజీని, ప్లాస్టిక్‌ను ఎప్పటికప్పుడు తీసివేసి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ అనేది వాడకుండా ఉండాలని ప్రతిషాప్ వద్ద, హోటల్స్‌లలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని, వాటిపైన స్పెషల్ టీముల వేసి జనాలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా పారిశుధ్య సిబ్బందికి పీపీ కిట్లు చేతికి బ్లౌజులు, ముఖానికి మాస్క్, కాళ్లకి షూ, రేడియం స్టిక్కర్ జాకెట్లు ధరించాలని సూచించారు. ప్రతిరోజు ఉదయాన్నే శానిటేషన్ మీద స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, సిబ్బంది అందరూ ఉదయం 5గంటల వరకు డ్యూటీలకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సాత్విక్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రామచందర్, జవాన్లు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ రుహాని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకులు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో విద్యార్థినులు ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆహూతులను ఎంతగానో అలరించింది. ఇక్కడి బిర్లా భాస్కర్ ఆడిటోరియంలో మేరా భారత్ మహాన్ పేరిట నిర్వహించిన ఈ నృత్య ప్రదర్శనలో బిందు మాధవి, భావన, నీలా, లిఖిత, రిధి అనే చిన్నారులు తమ అద్భుత నృత్య నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు , సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ చిన్నారులను ఆశీర్వదించారు. ఇలాంటి సంప్రదాయ కళలను భావి తరాలకు అందించాలని పిలుపునిచ్చారు.
–మియాపూర్ , ఫిబ్రవరి 2 :

ఉపయోగకరంగా లేని కేంద్ర బడ్జెట్

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 2: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజానీకానికి ఎలాంటి ఉపయోగకరంగా లేదని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేశ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమకు కొమ్ముకాసే వారికే బడ్జెట్‌లో కేంద్ర ప్రభు త్వం పరోక్షంగా ఎంతో వెసులుబాటు కల్పించిందన్నారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు వరాలు కురిపించి ఎన్నికలు లేని రాష్ట్రాలపై వివక్ష చూపించిం దన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

దుండిగల్ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించిన మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్,ఫిబ్రవరి2: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ సూచించారు. ఆదివారం దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ విలేజ్‌లో నిర్వహించిన దుండిగల్ ప్రీమియర్ లీగ్‌ను శంభీపూర్ కృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ప్రతిరోజు ఒక గంట సేపు ఏదో ఒక క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్లు జక్కుల కృష్ణయాదవ్, అమరం గోపాల్‌రెడ్డి, జక్కుల శ్రీనివాస్ యాదవ్, కొర్ర శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ కావలి గణేశ్, మాజీ ఎంపీటీసీ బండర్ మహేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ జితయ్య, సీనియర్ నాయకులు కొర్ర రవినాయక్ పాల్గొన్నారు.

బాలాజీ లే అవుట్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన బాలాజీ లే అవుట్ కాలనీ వాసులు

దుండిగల్,ఫిబ్రవరి2: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం బాలాజీ లేఅవుట్ అపార్ట్‌మెంట్ ప్రజలు ఆదివారం కూన శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిసి తమ లేఅవుట్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న ప్రతి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అనుక్షణం ప్రజాహితం కోసం పని చేస్తామన్నారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, అంజన్న, వెంకట్, శ్రీనివాసులు, వేణు, రాజు, సుకుమార్, విజయరెడ్డి, కిశోర్ కుమార్, ప్రదీప్, తిర్మాల్, చైతన్య, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవాలు

త్యాగరాజ ఘనరాగ పంచరత్న కీర్తనలని ఆలపిస్తున్న కళాకారులు

కొండాపూర్, ఫిబ్రవరి 2 : శిల్పారామంలో కొనసాగుతున్న త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవాల ముగింపు ఆదివారం ఘనంగా సాగాయి. దేశ విదేశాల నుంచి హాజరైన 600లకు పైగా సంగీత కళాకారులు సంప్రదాయ వేదికలో కలిసికట్టుగా త్యాగరాజ స్వామి ఘనరాగ పంచరత్న కీర్తనలని ఆలపించిన తీరు ఆద్యాంతం అలరించింది. అనంతరం హనుమత్సమేత సీతారామలక్ష్మణుల, త్యాగరాజ స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేక సేవ, ప్రసిద్ధ చిత్రకారులు కూచిచేగాత్ర, చిత్ర సమ్మేళనం నిర్వహించారు. ముగింపు వేడుకలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 2: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బృదావన్ కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దన్నారు. ప్రజలందరూ జీహెచ్ఎంసీ కార్మికులకు సహకరించాలన్నారు. కార్మికులు విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మాస్కులు, గ్లౌజ్, షూ తదితర వాటిని ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాండు యాదవ్, రావుల భాస్కర్, కొవ్వకుల బాబు, టి.చిన్నా, శివరాజ్, ఏ.శంకర్‌రెడ్డి, అమర్, రమేష్‌రెడ్డి, ఉత్తం, జీహెచ్ఎంసీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సామేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా విప్లవ జ్యోతి అల్లూరి ఫౌండేషన్

శ్రీనివాసచారి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

దుండిగల్,ఫిబ్రవరి 2: నిరుపేదలకు ఆపదలో ఆపన్నహస్తంలా విప్లవ జ్యోతి అల్లూరి ఫౌండేషన్ అండగా నిలుస్తోంది. జీడిమెట్ల ఇండస్ట్రీయల్ ఏరియాలో చిరు ఉద్యోగం చేసుకుంటున్న శ్రీనివాస్ చారి కుటుంబం సూరారం కాలనీలో నివాసం ఉంటుంది. శ్రీనివాస్ చారికి షుగర్ వ్యాధి సోకడంతో రెండు కిడ్నీలు పాడయ్యాయి. మల్లారెడ్డి హాస్పిటల్‌లో నిత్యం డయాలసిస్ చేయించుకుంటున్నారు.అదే సమయంలో అతడి భార్యకు బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టినట్లు తేలింది.దీంతో ఇద్దరూ దిక్కుతోచని పరిస్థితిలో విప్లవ జ్యోతి అల్లూరి ఫౌండేషన్ అధ్యక్షుడు .సత్తిబాబును కలిసి తమ సమస్యను తెలిపి,సహాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన సత్తిబాబు ఫౌండేషన్ ప్రతినిధులు చింతకింది నాగరాజు,జంగా తాతాజీ,అప్కాని నరసింహ,చిన్నబాబు దాతలు,ఫౌండేషన్ సభ్యులు సహకారంతో వారికి కావలసిన నిత్యావసర సరుకులు,ఆర్థిక సహాయం కింద రూ.5వేలను ఆదివారం అందజేశారు. సహాయం చేయదలిచిన వారు శ్రీనివాస్ చారి ఫోన్ ణంబర్ 995914173కు ఫోన్ పే, గూగుల్‌పే చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో గణపతి,నిఖిల్,చేతన్ అశ్విన్ పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

మెగా జాబ్ మేళాను ప్రారంభిస్తున్న నాయకులు

జీడిమెట్ల, ఫిబ్రవరి 2 : చింతల్ డివిజన్ పరిధి భగత్‌సింగ్ నగర్ లో గల మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆదిత్య కోడి, ఉదయ్ గంజిల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాలో బీజేపీ జిల్లా నాయకులు గిరివర్ధన్ రెడ్డి, డాక్టర్ ఎస్.మల్లారెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో సుమారు 350 మందికి పైగా యువత పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీలు పాల్గొని సుమారు 100 మందికి పైగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహమ్మద్ రఫీ, జల్లా లక్ష్మీనాథ్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జె.కె.శేఖర్ యాదవ్, నాయకులు భరత్‌సింహారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రాజేశ్ చారి, జీడిమెట్ల అధ్యక్షుడు రాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గరిగె శేఖర్ ముదిరాజ్, రాజా సదానందం, భాను చందర్, వర్మ, పులి బాల్‌రామ్, శ్రీనివాస్ రెడ్డి, సత్యం, ప్రేమ్, అబిద్, సాయికిరణ్, వినయ్ కుమార్, మధు, నర్సింహ, సత్యం తోడేటి, టిల్లు, యాదిలాల్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు
కాలం చెల్లినట్టే
-భవిష్యత్ అంతా మనదే
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు కార్తీక్ రెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: పేదల సంక్షేమ పథకాలకు ఎగనామం పెట్టి, మాయమాటలతో కాలయాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రాజేంద్రనగర్ నియోజక వర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పటోళ్లకార్తీక్ రెడ్డి అన్నారు. ఆదివారం సులేమాన్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎండీ , జహీరోద్దిన్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్యులకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయక పోవడంతో ఏడాదిలోనే ప్రజలకు దూరమైందని మండిపడ్డారు. ఎక్కువగా నిరుపేదలున్న ఈ మురికి వాడ ప్రాంతానికి, మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పదేళ్లలోనే నీళ్లు, విద్యుత్, సీసీ రోడ్లు, కనీస వసతులు, అనేక సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు.అభివృద్ధి పనులు చేయకుండా మాయమాటలు చెప్పే కాంగ్రెస్ నేతలకు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. వారు ఇచ్చిన హామీలకు, చేస్తున్న పనులకు పొంతన లేదన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కర్రుకాచి కాంగ్రెస్‌కు వాత పెట్టేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఎండీ ముఖీద్ చంద్ర, రహేమాన్, అమీర్, అస్రఫ్ నవాజ్, మగ్బుల్ గౌస్, షాజాబేగం, దౌలత్ పాష, శకీల్, దస్తగిరి, మహబూబ్, తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు. సులేమాన్ డివిజన్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సందడిగా నుమాయిష్

అబిడ్స్,ఫిబ్రవరి 2 : అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(నుమాయిష్)లో ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకులు పోటెత్తారు. వివిధ స్టాళ్లలో ఎక్కడ చూసినా జనసందోహం కనిపించింది.

వెల్ బేబీ షో...

అదేవిధంగా నుమాయిష్‌లో ఆదివారం వెల్ బేబీ షోని ఘనంగా నిర్వహించారు. ఎగ్జిబిషన్ సొసైటీ, యశోద ఆసుపత్రిల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఈ షోలో 0 నుంచి 3 సంవ త్సరాల వయస్సు గల చిన్నారులకు పలు ఆట పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యశోద హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ లింగయ్య, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, సొసైటీ సెక్రటరీ సురేందర్ రెడ్డి, ఎంసీ సభ్యులు డాక్టర్ మురళీ మోహన్, డాక్టర్ జీవన్, అడ్మిన్ డాక్టర్ శ్రీనివాస్, కన్వీనర్ డాక్టర్ ఎన్. సంజీవ్‌కుమార్, జాయింట్ కన్వీనర్ డాక్టర్ మల్లేశ్వరి, చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ సురేశ్‌లతో కలిసి ఆటపోటీలలో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు.

కాటేదాన్ స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలి

సౌకర్యాలు కల్పించాలంటూ నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 2: క్రీడాకారులకు ఉపయోగపడాల్సిన కాటేదాన్ ఇండోర్ స్టేడియంలో సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారిందని సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు జాజాల రుద్రకుమార్ అన్నారు. మండల నాయకులు పి.సి.కె.భాస్కర్ అధ్యక్షతన కాటేదాన్‌లో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని పర్యటించి సందర్శించారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో రూ. 24.61 కోట్లతో ఇండోర్ స్టేడియాన్ని నిర్మించారన్నారు. 2023లో దీనిని ప్రారంభించి వదిలేశారు. ప్రభుత్వం ఇండోర్ స్టేడియంలో ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో నిరుపయోగంగా ఉందన్నారు. స్విమింగ్ పూల్ మొత్తం ఎండిపోయి అందులో చెత్తాచెదారాలతో నిండిపోయిందన్నారు. విద్యార్థులు, యువకులకు ఈ స్టేడియంలో క్రీడలు ఆడుకునేందుకు ఉపయోగకరంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని కోరారు లేనిపక్షంలో ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు జి.ఎం.కురుమయ్య, జి.ఎం.గట్టయ్య, నర్సింహ, లక్ష్మణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.